క్లుప్తంగా

పరిశోధనలు చేయాలి



ముఖ్యఅతిథి అజితకుమార్ ఆచార్యను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్, తదితరులు

డెంకాడ: ఆత్మనిర్భర్ భారత్ దిశగా యువత పరిశోధనలు చేయాలని బెంగాల్‌కు చెందిన విశ్వధర్మ మందిరం ఇండియా ఆన్ మూవ్ ఎన్‌జీఓ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు అజిత్‌కుమార్ ఆచార్య అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో ఎ టాక్ ఆన్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు పఠనాశక్తితో పాటు భావోద్వేగ మేధస్సుపై పరిశ్రమించాలన్నారు. అనంతరం ముఖ్య అతిథి అజిత్‌కుమార్ ఆచార్యను కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, విభాగాధిపతి దర్గాశైలజ, అధ్యాపకులు సత్కరించారు.

రసాయన శాస్త్రంలో సురేఖకు డాక్టరేట్



ఏయూ వైస్ చాన్సలర్ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న సురేఖ

విజయనగరం టౌన్: నగరంలోని తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థి పి.సురేఖకు ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఈమె చిత్తూరులో సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నోల్ కేటాలిక్ అప్లికేషన్స్ ఆఫ్ కాపర్ ఫైరేట్ నానో పార్టికల్స్ అండ్ ఆప్టికల్ అప్లికేషన్ ఆఫ్ నానో కాంపోజిట్ అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. సత్య కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు, ప్రిన్సిపల్ ఎంవీ సాయిదేవమణి, తదితరులు సురేఖను అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో 'సఖి' గ్రూపు సభ్యుల మండల స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి గ్రూపులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లోపు బాలికల్లో రక్తహీనత సమస్య, పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలని, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని చెప్పారు. స్మార్ట్ ఫోన్ ఉన్న బాలికలు, మహిళలతో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమానికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, ఎంఈఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ భానోజీరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



మిల్లులో ధాన్యం మరపట్టడాన్ని పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ ధనం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి,పెద మానాపురంలోని రైస్ మిల్లుల్లో సీఎస్‌డీటీ ధనం సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం మరపట్టడాన్ని పరిశీలించారు. కోమటిపల్లి బాలాజీ రైస్ మిల్లులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు మిల్లులకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వారికి ఇబ్బందులు పెట్టకుండా తీసుకోవాలని సూచించారు. మండలంలో 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగులు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గెలిపించే బాధ్యత మీదే



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న హర్షవర్ధన్ రెడ్డి, కోలగట్ల వీరభద్రస్వామి

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ విజయనగర నియోజకవర్గ విస్తృత స్థాయి సమవేశంలో వక్తల పిలుపు

విజయనగరం: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించే బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని ఉత్తరాంధ్ర జేసీఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఉందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతూ ప్రజారంజక పాలన



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాలన పట్ల ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేయలేక వలంటీర్ వ్యవస్థను అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైందన్నారు. ప్రతి ఇంటికీ గృహసారథులు వెళ్లి ప్రభుత్వ పథకాలు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. గతంలో బూత్ కమిటీల స్థానే గృహసారథులు వ్యవహరిస్తారన్నారు. పార్టీ అందించిన కరపత్రాలు, ఇతర సామగ్రిని ప్రతి ఇంటికీ అందిస్తూ పార్టీ పట్ల ప్రజలు మరింత ఆకర్షితులయ్యే విధంగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన ప్రతినిధులుగా గృహసారథులు ప్రజలకు వివరించాలన్నారు. కరోనా సమయంలో కూడా ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ధైర్యశీలి జగనన్న అని కొనియాడారు. ప్రతిపక్ష విమర్శలను తిప్పికొడుతూ, సంక్షేమ పాలనను వివరిస్తూ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో గృహసారథుల మండల కమిటీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, మండల అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నారాయణ, కెళ్ల త్రినాథ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కంటోన్మెంట్ జోనల్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడారు. ప్రభుత్వ పాలనను, విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 30వ డివిజన్‌లో రూ. 3 లక్షలతో, 34 డివిజన్‌లో రూ. 6 లక్షలతో కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నగరంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 9 లక్షల రూపాయలతో రెండు డివిజన్‌లలో నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. 30వ డివిజన్ కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, బొద్దాన అప్పారావు, 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పరచుకోవాలి..



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్

- ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్

నెల్లిమర్ల: విద్యార్థులంతా పాఠశాల స్థాయిలోనే లక్ష్యం ఏర్పరచుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) అదనపు ఎస్పీ ఆస్మా ఫరీన్ సూచించారు. పట్టణంలోని వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలందరికీ ప్రస్తుత రోజుల్లో చదువు చాలా ముఖ్యమన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు తమ సత్తా చాటుతున్నారని తెలిపారు. లక్ష్యం దిశగా పయనించాలని సూచించారు డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ కె. ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు, ఎస్సై పి. నాగలక్ష్మి, నెల్లిమర్ల ఎస్సై పి. నారాయణరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెపటైటిస్ బి వ్యాక్సిన్‌తో రక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ బాధితులు హెపటైటిస్ బివ్యాక్సిన్ వేసుకుని రక్షణ పొందాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో హెచ్‌ఐవీ బాధితులకు సోమవారం హెపటైటిస్ బి వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెచ్‌ఐవీ బాధితుల ఆరోగ్య సంరక్షణకు ఈ వ్యాక్సిన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరి ప్రభు, ఏఆర్‌టీ సెంటర్ నోడల్ అధికారి ఆదిత్యవర్మ, డాక్టర్ వరలక్ష్మి, డీపీఎం బాలాజీ, డీఐసీ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వినియోగించుకోండి

హెచ్‌ఐవీ బాధితులు హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి తెలిపారు. స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో హెపటైటిస్ బి వ్యాక్సిన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ రామేశ్వరిప్రభు, తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన రంగంలో రాణించాలి

విజయనగరం ఫోర్ట్: బాలికలు తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని రాణించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. స్థానిక లంకవీధిలో వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాలికలందరూ చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కార్యక్రమంలో వార్డెన్ పెనుమత్స మేరీ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భోగాపురం: మండల కేంద్రంలోని ముక్కాం కూడలి వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో నాతవలస నుంచి ముంజేరు వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళాలు

విజయనగరం టౌన్: అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాలు తెరిచేందుకు మెగా మేళాలు నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల లోపు బాలికల పేరిట ఖాతాలు తెరిచి పిల్లల బంగారు భవిష్యత్‌కు తోడ్పడాలని కోరారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూరీసర్వేతో రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తహసీల్దార్ అరుణకుమారి అన్నారు. మండలంలోని రంగుపురం గ్రామంలో రైతులు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చేపట్టనున్న భూరీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సమగ్ర భూరీసర్వే ఎప్పుడో వందేళ్ల క్రితం జరిగిందని, మళ్లీ ఇన్నాళ్లకు ప్రభుత్వం సర్వే చేయిస్తోందని, రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

గుర్ల: ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు. మండ లంలోని దేవునికణపాక రెవెన్యూలో సర్వే నంబర్ 105–1లో ఉన్న చెరువు గర్భాన్ని కొంత మంది జేసీబీలతో చదును చేయిస్తున్నట్లు సమా చారం అందిందని చెప్పారు. సోమవారం రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి పనులను అడ్డుకున్నామని చెప్పారు. చెరువు గర్భాన్ని సర్వే చేయించి ఆక్రమణలు రుజువైతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించండి

- 108, 104 అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఏఎం (హెచ్.ఆర్) దినేష్ చాట్రగడ్డ

విజయనగరం ఫోర్ట్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని 108, 104 అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ అసిస్టెంట్ మేనేజర్ (హెచ్.ఆర్) దినేష్ చాట్రగడ్డ అన్నారు. సోమవారం స్థానిక 108, 104 కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు వైద్యసేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టిందన్నారు. సిబ్బంది ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 64 రకాల



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ చాట్రగడ్డ

మందులు అందజేస్తామన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆపదలో ఉన్నామని 108కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకుని రోగిని ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. అనంతరం ఇటీవల 108 మేనేజర్‌గా నియమించబడిన ఎస్. మన్మధనాయుడు, 104 జిల్లా మేనేజర్ (పార్వతీపురం మన్యం జిల్లా) దుర్గను అభినందించారు.

మార్చి 21లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



సమీక్ష సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్‌లు, అధికారులు

గజపతినగరం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొందిన వారితో పాటు, సొంత స్థలాలు ఉన్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను మార్చి 21 నాటికి పూర్తి చేసేలా అంతా కృషి చేయాలని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో ఇళ్ల నిర్మాణాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని, ఇంకా పనులు మొదలుపెట్టని వారితో త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, నిర్మాణాల దశలను ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ వలంటీర్లు అంతా లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

బొండపల్లి: నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ఎంపీపీ చల్ల చలంనాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నవ ధ్యానాలను సాగు చేద్దాం– నేలతల్లికి జీవం పోద్దాం అనే నినాదంతో మండలంలోని బి.రాజేరు గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. నవ ధ్యానాల సాగుతో భూమి గుల్లబారి నీటిని బాగా పీల్చుకుంటుందని, రబీ పంటలకు నీటి ఎద్దడి లేకుండా కాపాడుతుందన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెంది సహజ పద్ధతిలో పంటకు పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. నవధ్యానాలు విత్తిన 30 రోజుల



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, ప్రకృతివ్యవసాయ సిబ్బంది

త్వరాత చేనును పశువులకు దాణాగా వేయడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు. గజపతినగరం సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.రామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



ఆలయ నిర్మాణానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్న కనకల కృష్ణ

విజయనగరం: నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ నాయకులు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శాంతినగర్ పైనాలవీధిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కనకల కృష్ణ సోమవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చూపిన సేవామార్గంలో తామంతా నడుచుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సుంకరిపేట సర్పంచ్ సుంకరి రాజేశ్వరికి యంత్ర సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 5.5 లక్షల విలువైన పారిశుధ్య నిర్వహణ యంత్ర సామగ్రిని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పలనాయుడు మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంపిణీ చేసిన వస్తువుల్లో రూ. 50 వేల విలువైన ఫాగింగ్ యంత్రం, రూ. 12 వేల టాయిలెట్ క్లీనర్, సుమారు రూ. 20 వేల విలువైన ఇతర సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు తదితరులు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి వద్ద ఉపాధి హామీ పథకం నిధులతో వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మునగ నర్సరీలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అధికారులు, సర్పంచ్ నౌడు అరుణతో కలిసి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు 6,200 మునగ మొక్కలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ మొక్కల సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. పెరటిలో, కల్లాల వద్ద, పొలం గట్లపై మునగ మొక్కలు సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. మునగ ఆకు, కాడలు వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మునగలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సరీలో రూ.47 వేల ఉపాధి హామీ నిధులతో పదివేల మునగ విత్తనాలు నాటగా, 8,100 మొక్కలు పెరిగినట్లు చెప్పారు. నర్సరీ నిర్వాహకుడు దొగ్గ గంగునాయుడును అభినందించారు. తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, గ్రామపెద్దలు నౌడు శ్రీను, పైడునాయుడు ఉపాధి ఈసీ దేముడునాయుడు, టీఏలు,వీఓఏలు పాల్గొన్నారు.